ఎల్‌ఆర్‌ఎస్ సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్‌లు

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయటానికి కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల కోసం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కూడా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా ఆయా హెల్ప్ డెస్క్‌లలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అవసరమైన మేరకు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎం.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో జ్యోషిత గ్రూప్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (పోస్టులు: 900) పోస్టులకు విద్యార్హత ఏదైనా డిగ్రీ ఉండాలన్నారు. వేతనం రూ. 15 వేలు ఉంటుందన్నారు. టెలీ కాలర్స్ (ఖాళీలు:30)కు విద్యార్హతలు ఎస్‌ఎస్సీ, ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు. వేతనం రూ. 12 వేలు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన జిల్లాలోని యువతీయువకులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆయా కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూలలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అదనపు సమాచారం కోసం ఫోన్: 98664 65024లో సంప్రదించాలని సూచించారు.



జలకళ సంతరించుకున్న మేడ్చల్ పెద్ద చెరువు



నీటితో నిండిన తుమ్ము చెరువు

మేడ్చల్‌కు జలకళ

- మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షం
- పలు ప్రాంతాల్లో పోటెత్తుతున్న వరద
- పొంగి పొర్లుతున్న చెరువులు, కుంటలు
- జలమయమై గుంతలుగా మారిన రోడ్లు
- సహాయక చర్యలు చేపట్టిన యంత్రాంగం



అండర్‌పాస్ వద్ద నిలిచిన వాహనాలు



ప్రమాదకరంగా మారిన నిర్మాణంలో ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి పక్కనే ఉన్న భవనం



కాలువలా మారిన నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో మంగళవారం రాత్రి మొదలుకొని బుధవారం ఉదయం వరకు వర్షం దంచికొట్టింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో మేడ్చల్‌కు జలకళ సంతరించుకుంది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండు మూడు రోజులుగా కురిసిన వర్షమే పెద్దది కావడంతో మేడ్చల్‌వాసులకు అసలు వానాకాలం కనబడింది. మంగళవారం రాత్రి నుంచి కురిసన భారీ వర్షం నేపథ్యంలో బుధవారం తెల్లారేసరికి చెరువులు, కుంటల్లోకి వరద పోటెత్తి పొంగిపొర్లాయి. మేడ్చల్ చెరువులోకి నీటిని తీసుకొచ్చే గౌడవెల్లి, గిర్మాపూర్ వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

- మేడ్చల్ పట్టణంలో భారీ వర్షాలతో కాలనీలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు ఎక్కడికక్కడ పొంగిపొర్లాయి. ఆర్టీసీ కాలనీ, వినాయక్‌నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రాఘవేంద్రనగర్, మార్కెట్ రోడ్డు ఇలా ఎక్కడ చూసినా వరద నీరు కనిపించింది.
- మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అండర్ పాస్‌లోకి పూర్తిగా నీరు రావడంతో చాలా కాలనీలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జిలోకి నీరు చేరి కాలువను తలపిస్తుంది. అండర్‌పాస్ బ్రిడ్జి పక్కనే ఉన్న ఇంటి మట్టి కొట్టుకపోవడంతో ఇల్లు ఏ క్షణంలోనైనా కూలే ప్రమాదంలో పడింది.
- మేడ్చల్ పెద్ద చెరువు, తుమ్మ చెరువు, వివిధ గ్రామాల చెరువులు నీటితో నిండాయి. మరొక రోజు వర్షం కురిస్తే చెరువులన్నీ పొంగే స్థితికి చేరాయి. భారీ వర్షాలతో అప్రమత్తమైన అధికారులు నీరు ఇళ్లలోకి చేరకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కమిషనర్ నాగిరెడ్డి, చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న కౌన్సిలర్ ఉమానాగరాజు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు అధ్వానంగా మారి గుంతలమయమం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మరమ్మతులు చేయాలని మేడ్చల్ పట్టణ 16వ వార్డు కౌన్సిలర్ ఉమానాగరాజు జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రును కోరారు. ఈ మేరకు ఆమె కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించి సమస్యను విన్నవించారు. రోడ్డు విస్తరణ, ఫ్లైవర్‌ల నిర్మాణంతో మేడ్చల్ పట్టణం నుంచి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని అస్తవ్యస్తంగా మారిందని, గుంతలు, బురద, మట్టి అన్ని రకాలుగా అధ్వానంగా మారిందని అన్నారు. పిల్లర్ నెంబర్ 56వద్ద చెరువు నాలాను పూడ్చి వేశారని నూతన కల్వర్టు నిర్మించాలని రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మేడ్చల్: మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి గౌడవెల్లికి చెందిన ఇద్దరికి మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తన నివాసంలో వారి కుటుంబ సభ్యులకు ఆయన చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన కంసమ్మకు రూ. 60 వేలు, యాదమ్మకు రూ. 36 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి నాయకులు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన నిధుల చెక్కును మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి నగరంలోని తన కార్యాలయంలో అందజేశాడు. గ్రామానికి చెందిన కోట్ల సత్తయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం పొందగా ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 30 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు దుర్గరాజ్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రంగాలలో ప్రతిభచాటిన బాల బాలికలకు 2025 సంవత్సరంలో అందించనున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ పురస్కార్ అవార్డులకు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణారెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు మెడల్‌తోసహా సర్టిఫికెట్, ఇతర బహుమతులు ఉంటాయన్నారు. ఈ అవార్డులకు సంబంధించి 5 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు వంటి సేవా రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాతీయ అవార్డుల పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న తరువాత జిల్లా కలెక్టరేట్‌లోని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో ప్రతిని సమర్పించాలన్నారు.

బోయిన్‌పల్లి-మేడ్చల్ రోడ్డు విస్తరణకు అడ్డంకులు తొలగించాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 రోడ్డు విస్తీర్ణంలో భాగంగా బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు రూ. వెయ్యి కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు విస్తరణ పనులలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సహకరించి, నిర్మాణ పనులు చురుగ్గాసాగి పూర్తయేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డితో కలసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు నిర్మిస్తున్న ఆరు లేన్ల రోడ్డు పనులపై ఎదురవుతున్న సమస్యలను సంబంధిత ప్రాజెక్టు డైరెక్టర్‌తో కలెక్టర్ చర్చించారు. రోడ్డు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న పెట్రోల్ బంక్ అనుమతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారికి కలెక్టర్ గౌతమ్ సూచించారు. అండర్ పాస్ స్లిప్ రోడ్ పనులు, విద్యుత్ టవర్స్, డ్రెయిన్లు, పైప్ లైన్ తదితర పనులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సత్వరమే ఇతర స్థలాలో కూడా అవార్డుల క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్ చెల్లింపులు జరిగిన స్థలాలు అప్పగించటానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాగారంలో పారిశుద్ధ్య కార్మికుల మెరుపు ధర్నా



నాగారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కీసర: న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద మెరుపు ధర్నా చేశారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సుమారు 130 మంది పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని విధులు బహిష్కరించి ఒక్కసారిగా మెరుపు ధర్నాకు దిగారు. తమకు జీతాలు పెంచడంతోపాటు, పని గంటల్లో మార్పులు చేయడం, ఉన్నతాధికారులు వేధింపులను నిలువరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గతంలో అధికారులు, పాలకులు ఇచ్చిన హామీల మేరకు జీతాలు పెంచి అందజేయాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్లు, చెత్త ఆటోలు, ట్రాక్టర్లు నడిపిస్తున్న డ్రైవర్లతో సహా అందరి కార్మికులకు 8 గంటలు పనివేళలు చేయాలన్నారు. ప్రస్తుతం సమయ పాలన లేకుండా కార్మికులందరితో పనులు చేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని గతంలో మూడు సార్లు మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినా స్పందన లేనందునే తాము ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్మికుల ధర్నాకు బీజేపీ నేతలు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇందుకోసం కార్మిక సంఘాల నేతలతో అధికారులు చర్యలు జరపాలని డిమాండ్ చేశారు. కార్మికుల మెరుపు ధర్నా విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ కొకట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్‌లు మున్సిపల్ కార్యాలయం వద్ద కు చేరుకొని ధర్నాకు దిగిన కార్మికులతో చర్చించారు. వీలైనంత త్వరలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని చైర్మన్ చంద్రారెడ్డి హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. కార్మికుల జీతాల పెంపు, పనివేళల్లో మార్పులు తదితర అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చైర్మన్ స్పష్టం చేశారు.

భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, బాధితులు

ఉప్పల్ : ఉప్పల్ మెయిన్‌రోడ్డులో భూములు కోల్పోయిన వారికి పూర్తి పరిహారం చెల్లించాలని కోరుతూ.. బుధవారం పలువురు బాధితులు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం భూములు లాక్కొని పరిహారం చెల్లించడంలో తీవ్ర జాప్యం చేసిందని దీనివల్ల అనేకమంది భూయజమానులు వ్యాపారాలు, భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకే రకమైన ఆస్తులకు రెండు రకాల పరిహారం అందజేయడంతో తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. గజానికి రూ. 65 వేల చొప్పున నష్టపరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

24న మెగా లోక్‌అదాలత్

మేడ్చల్: మేడ్చల్ న్యాయస్థానం ఆవరణలో ఈ నెల 24వ తేదీన మెగా లోక్ అదాలత్‌ను న్యాయస్థానం నిర్వహించనున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనమాన్‌గౌడ్ తెలిపారు. స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సులు లేని డ్రైవింగ్ వంటి కేసులు పెండింగ్ ఉన్న వారు అదాలత్‌కు వెళ్లి కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. పెండింగ్ కేసులు ఉన్న వారు తమ ఒరిజనల్ లైసెన్సు, అధార్ కార్డులతో ట్రాఫిక్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

నియామకం

కీసర: కీసర గ్రామ యాదవ సంఘం యూత్ కమిటీని బుధవారం నియమితులయ్యారు. యూత్ అధ్యక్షుడిగా మచ్చాని అరవింద్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా దాసరి మహేందర్‌యాదవ్, మెట్టు మహేష్, ప్రధాన కార్యదర్శిగా చెట్టి అరవింద్‌యాదవ్, కోశాధికారిగా మచ్చాని భాస్కర్‌యాదవ్, జాయింట్ సెక్రటరీగా ముద్దం ఉపేందర్‌యాదవ్, సెక్రటరీగా పోచబోయిన మోహన్‌ను ఎంపిక చేశారు.

రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటే మెరుగైన పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ రెవెన్యూ అసోసియేట్స్ నిపుణులు

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రెవెన్యూ హక్కుల చట్టం - 2024 పై బుధవారం ఉప్పల్‌లోని రెవెన్యూ అసోసియేట్స్ ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. ఈ చర్చలో నూతన చట్టానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు డా. రాజారాం, వెంకటయ్య, వి. అశోక్, కె.రాజేందర్‌లు కూలంకషంగా చర్చించి ఓ నిర్ణయానికి వచ్చారు. ప్రజలకు మరింత సౌలభ్యం కోసం చట్టంలో మరిన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రికార్డు అఫ్ రైట్స్ బిల్-2024కు బదులుగా రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ లాండ్-2024 గా ఉంటే బాగుంటుందన్నారు. అసైన్డ్ పోర్టల్ పేరు భూ- మాత, లేదా భూ భారతి అని ఉండేలా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యలపై జిల్లా స్థాయిలో రెవెన్యూ ట్రిబునల్ ఏర్పాటు చేయాలని, కలెక్టర్ తర్వాత నేరుగా ట్రిబునల్‌కు అధికారులు ఉండేలా చూడాలని కోరారు. నిర్ణీత గడువు తప్పనిసరిగా విధించాలని, అప్పీల్‌కు 90 రోజుల లోపు, అప్పీలు చేసిన తర్వాత అధికారులకు 90 నుంచి 120 రోజులు పరిష్కారానికి అవకాశం కల్పించేలా ఉండాలన్నారు. రికార్డ్స్ ఎంట్రీకి సంబంధించి సివిల్ కోర్టుకు ఇచ్చిన అధికారాలను తొలగించి ట్రిబునల్‌కు అధికారాలు ఇవ్వాలన్నారు. బాలరాజు, రాపోలు రాములు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం'



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పంట రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో పట్టణంలోని రైతు సేవా సహకార సంఘం ఎదుట ఆ సంఘం డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, పోచిరెడ్డి, రైతులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఒకే సారి అందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రుణమాఫీని తప్పించుకోవడానికి ఆడిట్, ఆన్‌లైన్‌లో రికార్డు కాలేదంటూ కాలయాపన చేస్తున్నారని, నిబంధనలు పెట్టకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అంతకు రుణమాఫీపై ఎండీ రాహుల్‌రాజుతో వాగ్వాదానికి దిగారు. మండల వ్యవసాయాధికారి బాసిత్, అన్నదాతలు పాల్గొన్నారు.

108 వాహనాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారులు



అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కీసర: కీసరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న 108 వాహనాన్ని మేడ్చల్ జిల్లా అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ మాట్లాడుతూ... మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా 108 సిబ్బంది సకాలంలో స్పందించి సరైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం అంబులెన్స్‌లో ఉన్న మెడికల్ పరికరాల పనితీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఇచ్చే మందులు అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్నాయా లేదా అని 108 సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త విజేందర్, ఈఎంటీ కుమార్, రవి, పైలట్ రాంబాబు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎమ్ మృతికి సంతాపం

పోచారం: అన్నోజిగూడలోని పల్లె దవాఖానాలో ఏఎన్ఎమ్‌గా పనిచేస్తున్న నాగమణి మృతి చెందడంతో బుధవారం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ... కరోనా సమయంలో నాగమణి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆమె మృతికి సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు రాజశేఖర్, సాయిరెడ్డి, డా. అనిత, నాయకులు శేఖర్, కేఎం రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వాటర్ పైప్‌లైన్ పనుల ప్రారంభం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఐదో వార్డు కేఎల్ ఆర్ నగర్‌లో రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను చైర్ పర్సన్ పావనీజంగయ్య స్థానిక కౌన్సిలర్ అనురాధారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... కేఎల్‌నగర్ కాలనీ ప్రజలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడానికి పనులు ప్రారంభించామన్నారు.

శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించే శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా మేయర్ శాంతికోటేష్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సిద్దులుయాదవ్, కాయిత రాజుయాదవ్, వంగపల్లి రామస్వామి యాదవ్, కొమురయ్యయాదవ్, అమ్ముల రాజయ్యయాదవ్, మల్లయ్యయాదవ్, అధ్యక్షులు పంతంగి కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షులు సతీష్‌యాదవ్, మహేందర్‌యాదవ్, రాములుయాదవ్, రాజశేఖర్‌యాదవ్, నవీన్‌యాదవ్, నాగరాజు యాదవ్, వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



సాక్షి, సిటీబ్యూరో: 'సాక్షి' టీవీ కెమెరా స్టోర్స్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ ముద్ద చంద్రశేఖర్‌రెడ్డి ఆకస్మిక మృతి పట్ల 'సాక్షి' టీవీ కెమెరా హెచ్‌ఓడీ కృష్ణారావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని 'సాక్షి' టీవీ కెమెరా డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి వారు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టోర్స్ మేనేజర్ గోవిందరావు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీలోని నేతాజీనగర్‌లో చంద్రశేఖర్‌రెడ్డి సంతాప సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కీసర: లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం కీసర గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. వైద్యశిబిరంలో వైద్యులు ఉచితంగా వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు, వివిధ ఆస్పత్రుల వారు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నందకిషోర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు బెలిదే రమేష్‌గుప్తా, మచ్చాని జంగయ్యయాదవ్, గ్రామ కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

జవహర్‌నగర్: గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌వోటీ సీఐ జానయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకి చెందిన సర్కార్, విశ్వాస్, సర్దార్, సుమంత్‌ఘోష్‌లు పలు కార్లలో ఒరిస్సా నుండి గుట్టుచప్పుడు కాకుండా తీసుకువచ్చి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు జవహర్‌నగర్ గోశాల వద్ద గంజాయి తరలిస్తున్న కార్లను పట్టుకున్నారు. వారి నుంచి 10 కిలోల గంజాయి, రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, నలుగురు నింధితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.